


## ఆర్చేవాడినా-తీర్చేవాడినా

మా పొరుగింటి రంగస్వామికి యీ మధ్యనే కాస్త చెముడు దాపురించింది. ఈ విషయాన్ని అసరాగా తీసుకొని చీటికి మాటికి దెప్పుతూ యుండేది అతని భార్య చిట్టి. బుద్ధి తెలిసిన తరువాత అదే తెలుసుకొంటుందని రోజులు నెట్టుకొంటూ వస్తున్నాడు చిట్టి గయ్యాళి తనానికి జడిసి! ఇంటి విషయాలు ఏమైనా అడిగితే కస్సు మంటూ "ఆర్చేవారా - తీర్చేవారా? అని గర్జించేది చిట్టి! సరే నాకెందుకంటూ వూరుకొనే వాడు రంగస్వామి.

ఒకనాడు వీధి కొళాయి దగ్గర వీధి నారీమణులతో నీళ్లకై తగవు పెట్టుకొంది చిట్టి! ఆమె ధాటి కాగలేక కాంతామణులు కొందరు తప్పుకొన్నారు. కాని అందులో కొందరు గట్టిగా అడిగే సరికి వారిపై చేయి చేసుకొంది చిట్టి! ఇహ చూడండి! నలుగురూ ఏకమై చిట్టి వీపు చిట్లగొట్టారు. ఈ సంఘటన కళ్లారా చూచి విస్తుపోయాడు రంగస్వామి! చిట్టి దురుసు తనానికి తగిన శాస్తి జరిగిసదని మనసులో అనుకొంటూ యింట్లోకి పోయాడు చూచి చూడనట్లు.

చిట్టి చరచరా యింట్లోకి వచ్చి ఏమండీ! నన్ను తంతూ యుంటే చూస్తూ వూరుకొంటారా? చేత కాని వాడిలా? అంటూ ఉరిమింది రంగస్వామి పైకి! నేనెవడినే! నీవన్నట్లు ఆర్చే వాడినా - తీర్చే వాడినా అని అన్నాడు రంగస్వామి! ఆమాటతో చిట్టి నిశ్చేష్టురాలై పోయింది!

—ప్రతాప్,

## M. A.

గోపాలం రాధను పెళ్లి చేసుకుని రెండు సంవత్సరాలయింది, ఒక పిల్లవాడు కూడా కలిగాడు, ఒక నాడు మాటల సందర్భములో గోపాలం, రాధా మరి నీవు M. A. ప్యాసయ్యావు గదా, ఉద్యోగం చేయకూడదూ? యింకో యిద్దరు పిల్లలు పుడితే నా సంపాదన ఎంచాలుతుంది? నీ జీతం నా జీతంతో సంసారం హాయిగా గడుస్తుంది అన్నాడు, నేను M. A. చదివినానని ఎవరు చెప్పారు మీతో అంది రాధ నవ్వుతూ.—

అదేవిటి రాధా? మీ అన్నయ్య గదూ నాతో చెప్పింది? చెల్లి M. A. ప్యాసయిందని చెప్పాడు, శెలవులలో మీ అన్నయ్యతో మీ ఊరు వచ్చినప్పుడు నిన్ను చూడటం జరిగింది, సరే నీవు నచ్చావు పెళ్లి చేసుకున్నాను, నా స్నేహితు లందరితోనూ గర్వంగా చెపుతున్నానుకూడా, ఈ రోజుల్లో ఆడవాళ్లు ఉద్యోగం చేస్తున్నారుగా? తప్పేముంది అన్నాడు గోపాలం, మహాశయా నేను ప్యాసయింది ఏ M. A. అనుకున్నారా అంది పక పక నవ్వుతూ రాధ, మరేమిటి అన్నాడు గోపాలం ఆశ్చర్యపోతూ. మెట్రిక్ ఆఫ్ ఆంధ్రా M. A. కాదా అర్థం అల్లా వేళాకోళానికి అనుంటాడు అన్నయ్య అంది రాధ. అన్నను వేళాకోళం ఆడివుంటాడు నీకు పెళ్లి అయింది అన్నాడు తెల్లబోతూ గోపాలం.

—కొమ్ము మారుతిదేవి.

## ముహూర్త బలం

విశ్వం, బ్రహ్మం - ఇద్దరూ యూనివర్సిటీ పరీక్షలకు చదువుతున్నారు. వీరిద్దరూ చెరొక అరడజను సార్లు దండయాత్రలు చేసివచ్చి ఏడవ దండయాత్రకు సిద్ధమౌతున్న మేటియోధులు. వీరిలో బ్రహ్మానికి జ్యోతిష్యమన్నా ముహూర్తాలన్నా పిచ్చి ఎక్కువ. విశ్వానికి నమ్మకాలేం లేవు.

పరీక్ష లింక 3 రోజు లున్నాయనగా బ్రహ్మం సిద్ధాంతి ఇంటికెళ్ళి "నేను పరీక్షలకీ పట్నం వెళ్ళాలి. ఎప్పుడు మంచిదో కాస్త ముహూర్తం నిర్ణయించండ"ని అడిగాడు. సిద్ధాంతి ముహూర్తం కట్టి "ఈ రాత్రే మంచి ముహూర్తం వుంది. అప్పుడు ప్రయాణం చేస్తే వెళ్లిన పని తప్పక జయమయి తీర్తుంది. రేపు ఉదయం అసలు కూడదు. అప్పుడు దుర్ముహూర్తం. అప్పుడు ప్రయాణం చేస్తే తీరని నష్టం అని ముగించాడు. బ్రహ్మంతో కూడా వచ్చిన విశ్వం ఓస్! ఇలాటివి చాలా చూశాను. నేను రేపు ఉదయమే ప్రయాణమౌతాను. ఈ దుర్ముహూర్తం నన్నేం చేస్తుందో చూస్తా న"న్నాడు బ్రహ్మం, సిద్ధాంతీ కలిసి విశ్వాని కెంత చెప్పినా అతడు లెక్క చెయ్యలేదు. బ్రహ్మం మాత్రం సిద్ధాంతి చెప్పినట్లే ముహూర్తప్రకారం ప్రయాణమయ్యాడు. విశ్వం మర్నాడు దుర్ముహూర్తంలో బయల్దేరాడు.